# జన్మపరంపర

చింతా దీక్షితులు గారు
[సాహితీసమితి]

౧

అతడు ఫ్రాంసులో బీదకుటుంబములో జన్మించినాడు. శ్రీమంతులు దరిద్రులను పెట్టే బాధలన్నీ అతడూ అనుభవించాడు. రెండుమూడుసార్లు అకారణముగా చెరసాలలో వాసము చేయడము కూడా అతనికి సంభవించినది.

ప్రజలందరూ భాగ్యవంతులమీదికి తిరుగుబడ్డారు. భాగ్యవంతుల వశములో ఉన్న రాజ్యమును విధ్వంసము చేయుటకు పూనుకొన్నారు. ఆ స్వాతంత్ర్య యుద్ధములో అతడూ పాల్గొన్నాడు. చెరసాలను గోడను పడగొట్టుతుండగా ఒకరాయి అతని మీద పడుటచేత అతడు మరణించినాడు.

౨

అతనికిపునర్జన్మవచ్చినది. అమెరికా దేశములో పుట్టాడు. నీగ్రోజాతిలోజన్మించినాడు. అతనికి స్వజాత్యభిమానముఎక్కువగా ఉన్నది. తెల్లవాళ్లు నీగ్రోలవిషములో చేస్తూఉన్న దౌర్జన్యములను అతడుచూచి సహించలేక పోయాడు. వారితో కలహాము పెట్టుకొన్నాడు. వాళ్లను దూషించినాడు. తత్ఫలముగా ఒక తెల్లదొర తుపాకిదెబ్బతినిఅతడుమరణించాడు.

3

అతనికి పునర్జన్మ వచ్చినది. ఆఫ్రికా దేశములో 'జూలూ' జాతిలో అతడుపుట్టాడు. "జూలూ" జాతివారికి జాత్యభిమాన మెక్కువ. తన జాతి నాయకుడు ప్రక్కజాతి నాయకుడికి లొంగియున్నాడు. అది స్వతంత్రముకు భంగమని అతడు తనజాతి నాయకుణ్ణి పురిగొల్పాడు. అందరూ యుద్ధసన్నద్ధులయ్యారు. ఉభయ జాతులకూ మారణయుద్ధమైనది. జాతు లంతరించినవి. ఆయుద్ధములో మిగిలిన వారితోపాటు అతడూ మరణించినాడు.

౪

అతనికి పునర్జన్మ వచ్చినది. అతడు హిందూ దేశములో పుట్టాడు. ఇంగ్లీషువారి అధికారం దేశములో అభివృద్ధిచెందుచున్న రోజులు. అతడొక సిపాయి. స్వాతంత్రేచ్ఛ ఒకకారణముగా అతడుకూడా ఇతర సిపాయీలతోపాటు ఇంగ్లీషువారిపై తిరగబడ్డాడు. వీరుడనిపించుకొన్నాడు కాని ఫిరంగివాతబడి మరణించినాడు.

౫

అతనికి పునర్జన్మ వచ్చినది. అతడు ఇంగ్లాండులో ఉన్నత కుటుంబమున జన్మించినాడు. మంచిచదువులు చదువుకొన్నాడు. మంచి రాజకార్యధురంధరుడని పేరు పొందాడు. స్వదేశమునకు ఆపత్కాలమున మంచిమంచి సలహాలిస్తూ ఉంటాడు. "భారతీయులకు స్వాతంత్ర్య మియ్యవచ్చునా" అంటే, "ఇయ్యకూడదం"టున్నాడతడు.